క్లుప్తంగా

దరఖాస్తుల స్వీకరణ

తానూరు: మండలంలోని బామ్నితండా, ఉమ్రి(కే), ఝరి(బి)తండా, బెంబర, బోల్సా, తానూరు, బోరిగాం గ్రామాల్లో గురువారం రెవెన్యూ అధికారులు ఇళ్ల స్థలాల కోసం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా ఆర్ఐ గంగాధర్ మాట్లాడుతూ ఇంటి స్థలాలు లేని పేదలు ఈనెల మూడో తేదీలోగా పంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఆయా గ్రామాల పంచాయతీ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

కుంటాల: మండలంలోని విఠాపూర్ గ్రామంలో గురువారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ గొల్లపురం లక్ష్మీ రమేశ్, ఏఈవో గణేష్, గంగారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నిర్వాహకుడు అశోక్, వినాయక్‌రావుపటేల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ పండుగ

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్ పంచాయతీ పరిధి ఒడ్డెవాడలో గురువారం నల్లపోచమ్మ పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పెంబి జెడ్పీటీసీ జానుబాయి ఆలయంలో పూజలు చేశారు. పాపయ్య, బక్కన్న, చిన్నయ్య, పుల్లయ్య, నర్సయ్య ఉన్నారు.

ఎన్టీఆర్‌మార్గ్‌లో పర్యటన



తీగలను సరి చేయిస్తున్న చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మార్గ్ ప్రాంతంలో గురువారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయని చైర్మన్‌కు విన్నవించారు. వెంటనే సంబంధిత అధికారులను పిలిపించి దగ్గరుండి తీగలను సరి చేయించారు.

కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని పంచాయతీ ఆవరణలో గురువారం లేబర్ కార్డు కలిగిన కార్మికులకు సీఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సీబీపీ, లిపిడ్ ప్రొఫైల్, ఎల్ఎఫ్టీ, టీ3, టీ4, టీఎస్‌హెచ్, బీపీ, షుగర్, యూరిన్, రక్త, కంటి, చెవి సంబంధిత పరీక్షలు చేశారు. వారం రోజుల అనంతరం కార్మికులకు రోగాలు నిర్ధారణ అయితే సంబంధిత డాక్టర్‌ను సంప్రదించి టెలీ మెడిసిన్ ద్వారా ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ శ్రీకాంత్, క్యాంప్ కోఆర్డినేటర్ సాయినాథ్, ఆరోగ్య సిబ్బంది వెంకట్, గజేందర్, కల్యాణి, సుధీర్‌కుమార్, సుమలత, ప్రేమలత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

ముధోల్: మండల కేంద్రంలో గురువారం గ్రామదేవత ఊరడమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. తెల్లవారుజామున మంగళహారతులు, డొంతులు, బాజాభజంత్రీలతో ఊరేగింపు నిర్వహించారు. అర్చకుల మంత్రోచ్ఛరణల నడుమ దేవతాపూజ, హోమం, ప్రాణ ప్రతిష్ఠ, హారతి నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. వీడీసీ కార్యదర్శి నారాయణ, కోశాధికారి సాయినాథ్, సర్పంచ్ రాజేందర్, ఎంపీటీసీ భూమేష్, అనిల్, పోతన్న, పోశెట్టి, రాందాస్, భూమన్న తదితరులున్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

లక్ష్మణచాంద: ప్రజలు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని గ్రామీణ్ సఫోర్ట్ ఫౌండేషన్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని వడ్యాల్‌తాండా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల వ్యాధులు, అరికట్టే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూలవతి, ఏఎన్ఎం భూలక్ష్మి, చైల్డ్ ఫండ్ ఇండియా వర్కర్ భోజన్న తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో భిక్షాటన చేయించొద్దు

సారంగాపూర్: బాలలతో భిక్షాటన చేయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా బాలల పరిరక్షణాధికారి సగ్గం రాజు అన్నారు. మండలంలోని చించోలి(బి) గ్రామ పరిసరాల్లో భిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. లక్షణచాంద మండలం పీచర గ్రామానికి చెందిన గమ్మిడి నడిపెన్న-గంగాలక్ష్మి వారి బాబుతో కలిసి భిక్షాటన చేసినట్లు గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. పిల్లల పోషణ భారమైతే తమకు సమాచారం ఇవ్వాలని వారి బాధ్యతలు చూస్తామన్నారు. అనాథలను అక్కున చేర్చుకోవడం, సంతానం లేని దంపతులకు దత్తత ఇచ్చే అంశంపై పలువురికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది ఉన్నారు.

అయోమయంలో అన్నదాతలు

- కేంద్రాల్లోనే ధాన్యం బస్తాలు
- సమీపిస్తున్న వానాకాలం
- సాగు పనుల సమయంలో పడిగాపులు
- కొనుగోళ్లు వేగవంతం చేయాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు



ఖానాపూర్ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం బస్తాలు

ఖానాపూర్: కష్టపడి పంటలు సాగు చేసే అన్నదాతలకు కాలమేదైనా కష్టాలు తప్పడం లేదు. అమ్మబోతే అడవి కొనబోతె కొరివిలా మారింది రైతుల పరిస్థితి. యాసంగి పంట చేతికందే సమయంలో అకాల వర్షాలు నష్టపరిస్తే ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తూకం, తరలింపు ఆలస్యమవుతుంది. ఉరుములు మెరుపుల వాతావరణం రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. వర్షం వస్తే టార్పాలిన్లతో రైతన్నలు కొనుగోలు కేంద్రాల బాట పడుతూ అక్కడే జాగారం చేస్తున్నారు. లారీలు, గన్నీసంచులు, హమాలీల కొరత తదితర కారణాలను సాకుగా చూపుతూ ధాన్యం తూకం, బస్తాల తరలింపులో అధికారులు జాప్యం చేస్తున్నారని పలువురు రైతులు భయాందోళన చెందుతున్నారు.

నత్తనడకన కొనుగోళ్లు..

ఖానాపూర్ మండలంలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో ఇప్పటివరకు 1,499 మంది రైతులకు సంబంధించిన ధాన్యాన్ని మాత్రమే నిర్వాహకులు తూకం వేశారు. ఇంకా వందలాది మంది రైతుల పంట కేంద్రాల్లోనే ఉంది. వీటన్నింటికి తోడు తాలు, తప్ప, తేమ శాతం తదితర పేర్లతో తూకంలో ఇష్టారాజ్యంగా కోతలు విధిస్తున్నారు. కేంద్రంలో తూకం వేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలిస్తే అక్కడా కోతలు తప్పడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు.

తరలించాల్సిన బస్తాలు అనేకం..

మండలంలోని 12 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు రైతుల నుంచి 1,58,578 ధాన్యం బస్తాలు కొనుగోలు చేశారు. వాటిలో నుండి ఇప్పటి వరకు 123068 బస్తాలు రైస్‌మిల్లులకు తరలించారు. ఇంకా తూకం వేసిన 35,480 బస్తాలను తరలించాల్సి ఉంది. లారీల కొరతతో నిలిచిపోయాయి.

పెట్టుబడులకు ప్రైవేటు వ్యాపారులే దిక్కు..

వానాకాలం సాగు పనులు ప్రారంభించేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక ధాన్యం డబ్బుల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. కానీ ఇప్పటికీ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం కుప్పలు ఉండటంతో పెట్టుబడులకు ప్రైవేటు వ్యాపారులే దిక్కని వాపోతున్నారు.

సారంగపూర్: సారంగపూర్ మండలంలోనూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలోని జామ్, సారంగపూర్, ఆలూరు, బోరిగాం, బీరవెల్లి, కొట్ల(బి) తదితర గ్రామాల్లో ధాన్యం నిలువలు పేరుకుపోయాయి. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి రోజులు గడుస్తున్నా.. తూకంలో జాప్యం, లారీలు రాకపోవడం, గన్నీ సంచుల కొరత వంటి సమస్యలు అన్నదాతలను అవస్థలకు గురి చేస్తున్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన అధికార యంత్రాంగం, పాలకులు పట్టింపులేనట్లు వ్యవహరించడంతో ఇటీవల చించోలి(బి), జామ్ గ్రామాల రైతులు రోడ్డెక్కారు. ఆందోళన సమయంలో ఓదార్చేందుకు లారీలను తాత్కాలికంగా తెప్పించి హడావుడి చేస్తున్నారే తప్ప శాశ్వత చర్యలు చేపట్టడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.



జామ్‌లో పేరుకుపోయిన ధాన్యం నిల్వలు

సొంత ఖర్చులతో తరలించా



నేను ఐదెకరాల్లో వరి సాగు చేశా. దిగుబడి బాగానే వచ్చింది. కేంద్రంలో ధాన్యం పోసిన 15 రోజులకు గన్నీబ్యాగులు ఇచ్చారు. తూకం వేయడానికి నాలుగు రోజులు పట్టింది. లారీల రాక ఆలస్యం కావడంతో నా సొంత ఖర్చులతో లారీని తెప్పించి ధాన్యం బస్తాలను గోదాంకు తరలించాం. అదనంగా రూ.10వేలు ఖర్చు అయింది. – ప్రభాకర్, రైతు, జామ్

ఎన్నిరోజులు పడిగాపులు..



కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి రోజులు గడుస్తున్నాయి. ఇప్పటికీ సంచులు ఇవ్వరు.. పంట కొనుగోలు చేయరు. ఇలాగైతే మా పరిస్థితి ఏంది? వానాకాలం సాగు పనులు ప్రారంభించే సమయమిది. మార్కెట్‌లో ఎన్ని రోజులు పడిగాపులు కాయాలి. అధికారులు స్పందించి కొనుగోళ్లు వేగవంతం చేయాలి. – నారాయణ, రైతు, జామ్

ఇప్పటివరకు 100 మెట్రిక్ టన్నుల ధాన్యం కూడా కొనలేదు..

మండల వ్యాప్తంగా రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానుండగా ఇప్పటివరకు దాదాపు 100 మెట్రిక్ టన్నుల ధాన్యం కూడా కొనకపోవడంతో రైతులు మార్కెట్లలోనే పడిగాపులు కాస్తున్నారు. వర్షం కురిస్తే చేసిన కష్టమంతా నేలపాలవుతుందని కేంద్రాల వద్దే ఉంటున్నారు. మృగశిర కార్తె సమీపిస్తుండటంతో ఇంకా సాగుపనులు మొదలుపెట్టని రైతులు అయ్యో దేవుడా అంటూ విలపించే పరిస్థితులు నెలకొన్నాయి. ఇకనైనా అధికారులు, పాలకులు స్పందించి ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయించాలని పలువురు రైతులు వేడుకుంటున్నారు.

వీవోఏల సమ్మె విరమణ

లక్ష్మణచాంద: తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో తాము సమ్మె విరమిస్తున్నట్లు మండలంలోని వీవోఏలు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం లక్ష్మణచాందలోని సెర్ప్ కార్యాలయంలో ఏపీఎం వాణిశ్రీకి సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును కలిసి విన్నవిస్తే సానుకూలంగా స్పందించారన్నారు. గురువారం నుంచి తాము విధుల్లో చేరినట్లు తెలిపారు.

దస్తురాబాద్: ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో తాము సమ్మె విరమిస్తున్నట్లు గురువారం ఏపీఎంకు లేఖను అందజేశారు. వీవోఏల సంఘం మండలాధ్యక్షుడు రమేశ్, వీవోఏలు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వీవోఏలు 40 రోజులుగా చేస్తున్న సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు జయశీల తెలిపారు. గురువారం విధుల్లో చేరినట్లు ఐకేపీ ఏపీఎం లక్ష్మణ్‌కు వినతిపత్రం అందించారు.

ప్రభుత్వ అధ్యాపకుల ప్రచారం



విద్యార్థులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

భైంసాటౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని భైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు అన్నారు. గురువారం భైంసా పట్టణంతోపాటు కుభీర్ మండలం మాలేగాం గ్రామంలో ప్రభుత్వ కళాశాలలో చేరాలని ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కలిసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు హరిప్రసాద్, సంతోష్ తదితరులున్నారు.

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని గణేశ్‌నగర్ శ్రీ వీరహనుమాన్ ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10లక్షలు కేటాయించగా.. కాలనీవాసులు స్వచ్ఛందంగా రూ.6లక్షలు విరాళంగా సేకరించారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కృష్ణ, డైరెక్టర్ తోట రాము, ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మణ్, రాజేశ్వర్, సుదర్శన్, విలాస్ గాదేవార్ తదితరులున్నారు.

లోకేశ్వరం: మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎడ్బూర్ గ్రామంలో మహాదేవ్ మందిరం నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేసి మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఏదో ఒక విధంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. మహాదేవ్ మందిర నిర్మాణం కోసం సీజీఎఫ్ కింద రూ.34 లక్షలు మంజూరు చేశామన్నారు. ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, సర్పంచ్ సురేఖబాయి, భోజన్న, ప్రశాంత్, దిగంబర్, రాజన్న, భోజారెడ్డి, లక్ష్మణ్‌పటేల్ పాల్గొన్నారు.



ఎడ్బూర్‌లో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలో గురువారం ఐసీటీసీ సీఎఫ్ఐ ఎన్జీవో ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకొని జాగ్రత్తలతో అరికట్టవచ్చని ఎన్జీవో సిబ్బంది రాంచందర్, సుజీత్, వేణుగోపాల్ అన్నారు. ఉపసర్పంచ్ రంజిత్, పంచాయతీ కార్యదర్శి మౌనిక తదితరులు ఉన్నారు.

పుస్పూర్‌లో..

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్‌లో ఎయిడ్స్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భైంసా ఐసీటీసీ వైద్యులు విలాస్ మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సన్న, ఐసీటీసీ సిబ్బంది మహిపాల్‌రెడ్డి, డీఎస్ఆర్‌సీ సతీశ్, మల్లికార్జున్, సవిత, ధనలక్ష్మి, సంగీత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



కడెం: కరపత్రాలతో నాయకులు, సిబ్బంది

బాబా ఆలయంలో భక్తుల పూజలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సింగిల్ ట్రస్ట్ చైర్మన్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో నిర్మల్‌తోపాటు, చుట్టుపక్కల గ్రామాలవారు పెద్ద సంఖ్యలో పాల్గొనగా పూజారులు తీర్థప్రసాదం అందజేశారు. గురువారం అన్నదాతలుగా నిలిచిన రజిత-చొక్కారావు, వై.లత-అర్జున్, ఎస్.లహరిక-రత్నాకర్ దంపతులను ఆలయ చైర్మన్ శాలువా, పూలమాలలతో సన్మానించారు. జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో ఇటీవల నిర్మించిన సాయి ద్వారకా కల్యాణ మండపాన్ని అద్దెకు ఇస్తున్నామని.. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సాయిదీక్ష సేవా సమితి సభ్యులు ఉప్పుల నందు, జిందం గోవర్ధన్, సోమేష్, భూషణ్, చౌదరి, ఆమెడ శ్రీధర్, నరాల రేణుక దాస్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్ — చెత్త తొలగించరూ...!



నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రసూతి ఆసుపత్రి పక్కన ఖాళీస్థలంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తతో నింపడంతో పరిసరాలు అధ్వానంగా మారాయి. దీంతో దోమలు వ్యాప్తి చెంది ఆసుపత్రికి వచ్చే వారు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గర్భిణులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: దేవిదాస్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఫోన్: 96400 50750

స్వచ్ఛంద సేవకుడికి సత్కారం

కడెం: మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో కడెం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని నచ్చన్ఎల్లాపూర్ గ్రామ సర్పంచ్, స్పందన స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బొడ్డు గంగన్నను సన్మానించారు. చలివేంద్రాలు, అంబలి కేంద్రాలు తదితర సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న గంగన్న సేవలను జర్నలిస్టులు అభినందించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు రవీందర్, దశ, రంజిత్, రాజేందర్, విజయ్, తదితరులు ఉన్నారు.

రికార్డులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలి

ఖానాపూర్: అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులను టీచర్లు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్యామల, శ్రీలత అన్నారు. గురువారం పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో మండలంలోని సుర్జాపూర్ సెక్టార్‌తోపాటు మామడ మండలం పరిమండల్ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఆయా కేంద్రాల టీచర్లు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు పకడ్బందీగా నిర్వహించాలి

లోకేశ్వరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో సోలోమాన్‌రాజ్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై సమావేశంలో వారు మాట్లాడారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 2 నుంచి 22 వరకు నిర్వహించే ఉత్సవాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు రావాలన్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, తహసీల్దార్ సరిత, ఏవో గణేశ్, వైస్‌ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తానూరు: మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించేందుకు పలు శాఖల అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

వాడీవేడిగా పెంబి మండల సమావేశం

- జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ మధ్య మాటల యుద్ధం

పెంబి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ భూక్య కవిత అధ్యక్షతన నిర్వహించిన పెంబి మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. గత నెల 16న నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జెడ్పీటీసీ జానుబాయి, వైస్ ఎంపీపీ గంగారెడ్డి మధ్య మాటల యుద్ధం నడిచింది. గతేడాది వర్షాలకు మండలంలోని పస్పుల వంతెన కూలడంతో రాకపోకలు సాగించేందుకు పది గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తిరిగి ఎప్పుడు నిర్మిస్తారని జెడ్పీటీసీ జానుబాయి అధికారులను ప్రశ్నించారు. టెండర్ పూర్తి చేశామని త్వరలో పనులు ప్రారంభిస్తామని ఆర్అండ్‌బీ డీఈ మల్లారెడ్డి సమాధానమిచ్చారు. వైస్ ఎంపీపీ గంగారెడ్డి మాట్లాడుతూ గతంలో మండలంలోని పుల్గంపాండ్రి నుంచి ఇట్యోడ మండలం సిరిచెల్మ గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మించేందుకు ఎంపీ సోయం బాపురావు సిరిచెల్మ వద్ద ప్రారంభించిన పనులు ఎక్కడి వరకు వచ్చాయని జెడ్పీటీసీని వైస్ ఎంపీపీ ప్రశ్నించారు. అటవీ అనుమతుల కారణంగా ఆలస్యమవుతుందని జెడ్పీటీసీ పేర్కొనగా కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొస్తే గిరిజన గ్రామాలకు రోడ్డు వేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వైస్ ఎంపీపీ సవాలు విసిరారు.

భగీరథ నీరు రావడం లేదు..

తమ గ్రామాలకు భగీరథ నీరు రావడం లేదని పలువురు సర్పంచ్‌లు పేర్కొనగా.. సమస్యలను పరిష్కరించి.. అన్ని గ్రామాలకు నీటిని సరఫరా చేస్తామని భగీరథ ఏఈ విష్ణు పేర్కొన్నారు. ఎంపీవో రత్నాకర్ రావు, సర్పంచ్‌లు, భగీరథ, అటవీ, ఆరోగ్య, వెటర్నరీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో జెడ్పీటీసీ జానుబాయితో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ గంగారెడ్డి

జీలుగ విత్తనాలు తీసుకోవాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్

పెంబి: రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై జీలుగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక బ్యాగు రూ.843 ఉంటుందని రెండున్నర ఎకరాల్లో విత్తుకోవచ్చన్నారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్‌లతో ఏఈవోలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పుప్పాల శంకర్, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు పూర్ణచందర్ గౌడ్, మహేందర్, విలాస్, రాజేందర్, శ్రీను, రమేశ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు అందిస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

అందుబాటులో జీలుగ విత్తనాలు

సారంగపూర్: మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆసక్తి కల్గిన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, జిరాక్సులు తీసుకొచ్చి విత్తనాలు పొందాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

'సౌకర్యాలు కల్పించడంలో విఫలం'

ఖానాపూర్: కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మండలాధ్యక్షుడు టీకు ప్రకాశ్ అన్నారు. గురువారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపం, స్థానిక అధికారుల నిర్లక్ష్యం కారణంగా కేంద్రాల్లో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా కోతలు విధిస్తున్నారని పేర్కొన్నారు. సమస్యలపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలన్నారు. సమావేశంలో కాలేరి రాజేందర్, జగదం శ్రీనివాస్, ఉన్నారు.

పరామర్శ

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్‌లో ఇటీవల వడదెబ్బతో మృతి చెందిన పాలకుర్తి లక్ష్మణ్ కుటుంబాన్ని ప్రభుత్వంఆదుకోవాలని పెంబి జెడ్పీటీసీ జానుబాయి అన్నారు. గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.రెండు వేలు అందించారు. వారి వెంట నాయకులు పెద్ది రమేశ్, మేకల వెంకటేశ్, సిద్ధార్థ్ నాయక్ ఉన్నారు.


భక్తుల సందడి

కుంటాల: రెండో షిరిడిగా వెలుగొందుతున్న మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. బాబాను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నర్సాపూర్(జి) మండలంలోని తురాటి గ్రామానికి చెందిన గడ్డం రాంరెడ్డి అన్నదానం చేశారు.

కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి

ఖానాపూర్: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏఎల్ఎంఎస్‌సీ కమిటీలను టీచర్లు ఏర్పాటు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల అన్నారు. గురువారం మండలంలోని అడవిసారంగాపూర్‌లో కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా పూర్తిస్థాయిలో అంగన్‌వాడీ లెవల్ మానిటరింగ్ సపోర్ట్ కమిటీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సర్పంచ్ చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో కేంద్రం పరిధిలోని ఆశావర్కర్, గర్భిణి, బాలింత, ఉపాధ్యాయుడితో పాటు 11 మంది సభ్యులు ఉంటారన్నారు. అనంతరం కేంద్రంలో ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ గార్డెన్, మాస్ ప్లాంటేషన్‌పై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ లత ఉన్నారు.

'సీఎం హామీలు ఏమయ్యాయి'



మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: ఖానాపూర్‌లో ఆర్డీవో కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని సీపీఐ(ఎంఎల్) నాయకులు సునారికారి రాజేశ్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సర్దార్ ప్రశ్నించారు. గురువారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో విలేకరులతో మాట్లాడారు. 2018 ఎన్నికల వేళ ఖానాపూర్ వచ్చి ఇచ్చిన హామీల్లో కేసీఆర్ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. సదర్మాట్ బ్యారేజీ పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పాలన్నారు. డీ27, డీ28 కాల్వలకు మరమ్మతులు చేయాలన్నారు. కడెం వరదలతో నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలన్నారు. గోపినర్సయ్య, భూక్య విలాస్, లింగన్న, చిన్నరాజన్న, స్వామి, రేకుల గంగన్న తదితరులున్నారు.